# నీకు తెలియని నిజం

(ఆంధ్రజ్యోతి వీక్లీ)

సత్తిగాడికి డబ్బున్నవాళ్ళంటే అసూయ, ద్వేషం లేవు!

వాళ్ళంటే గౌరవం, భయం ఉన్నాయి!

వాళ్ళు లేకపోతే, బీదవాళ్ళెలా బ్రతుకుతారు?

వాళ్ళు చల్లగా చూడబట్టే తనలాంటి వాళ్ళ బ్రతుకు కడతేరుతోంది!....అయితే సత్తిగాడికి తెలియని భయంకరమైన నిజం ఏమిటి....?

వర్షం!

నేలనూ, నదులనూ ఏకంచేసేలా ఒకటే వర్షం!

ప్రపంచాని కంతటికీ ముసురు పట్టినట్లు హోరున కురుస్తోంది.

నల్లని మేఘాలు ఏనుగుల గుంపుల్లా ఆకాశాన్ని ఆక్రమించుకున్నాయి.

భయంకరంగా ఉరుములు!

బంగారు కత్తుల్ని ఝుళిపించినట్లుగా మెరుపులు!!

కుంభవృష్టిగా కురుస్తోంది వాన!

రంగి చూరు కిందనుండి వంగి బయట ప్రపంచాన్ని చూసింది. గాలికి ఒరిగిపోయిన మర్రిచెట్టు చచ్చిపోయిన రాక్షసుని కళేబరంలా వుంది. నేలనుండి బయటపడిన దాని వేళ్ళు జుట్టు విరియబోసుకున్న భూతాల్లా వున్నాయి.

పట్నంవంక పోయే రోడ్డుమీద చూపు అందినంత మేర ఎవ్వరూ కనిపించడంలేదు.

వికృతంగా వీస్తున్న చలిగాలికి వణికిపోతూ లోపలకు వచ్చేసింది.

సాయంకాలం సన్నబడిపోతోంది.

ముసురుగా వుండడం వలన కాలమే సరిగ్గా తెలియడంలేదు.

నిన్న చద్దెన్నం తిని పట్నం వెళ్ళిన సత్తిగాడు ఇంకా రాలేదు. నిన్న ఆడు బయలుదేరేవేళకే మబ్బులు బాగా ముసురుకున్నాయి. పట్నం వెళ్ళద్దంటూ ఆడికి చెప్పిన మాటలు గుర్తుకొచ్చేయి రంగికి.

"మావా!" అంటూ సత్తిగాడిని పిలిచింది.

"ఏంవే!" అన్నాడు వాడు లాలసతో రంగి వంక చూస్తూ.

"ఇప్పుడు బాడుగ కట్టక! తిరిగి వచ్చేయేళకు బాగా వాన వచ్చే
స్తాది!"

"వర్షం వస్తే మనకేం! మరిన్ని డబ్బులు కిడతాయి!"

"నువ్వు వర్షంలో సిక్కడిపోతే, ఎలామరి?"

"ఎర్రి మొకవా! అలాటి భయాలు పెట్టుకోమాక!....రంగీ.... ఇది మునసబుగారి బాడుగ....కట్టకపోతే ఎలాగ?....అలాటి పెద్దవుల సలవవల్లే మనం కాసింత గంజినీళ్ళు తాగుతున్నాం...."

"అదికాదు మావా...." అంటూ ఏదో చెప్పబోయింది.

అబ్బే! అసలు ఆడు వింటేకదా!

అదీ తీరే అంత!....

"సందేళలోగా తిరిగొస్తా....నువ్వు బెంగెట్టుకోమాక" అంటూ కొరడా ఝుళిపించి ఎద్దుని అదిలించి నిన్న పొద్దుట పట్నం వెళ్ళిపోయాడు బండి తోలుకుంటూ.

ఆడు వస్తానన్న నిన్నటి సందేళ గడిచిపోయింది.

ఈ యేల్టి సందేళ కూడా కరిగిపోతోంది.

ఇంకా సత్తిగాడు తిరిగి రాలేదు.

వర్షాన్ని తిట్టుకుంటూ పొయ్యి దగ్గరకు వెళ్ళింది రంగి.

కుండలో బియ్యం కుతకుత లాడుతున్నాయి.

వాటిని కలియబెట్టి, పొయ్యిలో కట్టెలు ఎదరకు తోసి మళ్ళీ చూరు క్రిందకి వచ్చింది రంగి!

చూరు కింద కిటికీలో వుంచిన సీసాల్లోని బిళ్ళలూ, బిస్కెట్లూ అలాగే వున్నాయి మొన్నటి నుండీ!

కానీ కూడా బేరం లేదు!

సిగరెట్లు బీడీలు సరేసరి!

ముసురుకి తడిసిన అగ్గిపెట్టెలన్నీ ఒక వారగా ఆరబెట్టింది. సత్తిగాడు బండి బాడుగతోలి రోజూ కనీసం రెండు రూపాయలయినా తెస్తాడు

ఈ చిల్లర కొట్టుమీద తాను కనీసం రూపాయి పైగా రోజూ మిగులుస్తుంది.

ఆ డబ్బుతో తమ యిద్దరి బతుకులూ కడతేరిపోతున్నాయి.

దూరాన ఎక్కడో పిడుగు పడింది.

ఆ శబ్దానికి రంగి ఉలిక్కిపడింది!

'మావ ఈ వర్షంలో ఎక్కడ చిక్కడిపోయాడో?

అసలు తనని మనువాడేకే ఆడికి కష్టాలన్నీ మొదలయినాయి. లేకపోతే హాయిగా యవసాయం చేసుకునే రైతు బిడ్డకి బండి తోలుకో వలసిన గతేం పట్టింది!

అన్నిటికీ కారణం తనే!

తాను కులం లేనిది!

అమ్మ ఎవరో బాబు ఎవరో తెలీదు!

మాల గూడెంలో మసిబొగ్గులా పెరిగింది తాను!

సత్తిగాడు పెద్ద రైతు కుటుంబంలోని మడిసి. తనను చూసి మనసుపడి, మనువాడేడు.

ఈ మనువుకు అతడి కులం పెద్దలు మండిపడ్డారు. సత్తిగాడ్ని కులం నుండి వెలేశారు.

ఆడు తనను ఊరునుండి బయటకు తీసుకొచ్చి కాపరంపెట్టాడు. అప్పటి నుండీ బండి బాడుగతోలి తనను పోషిస్తున్నాడు. ఆడి కష్టం చూడలేక తాను ఈ చిల్లరకొట్టు నడుపుతోంది!'

ఆకాశం భీకరంగా ఉరిమింది!

ఆలోచనలనుండి విడివడి చుట్టూ కలయజూసింది రంగి!

సంజె చీకట్లు పూర్తిగా ముసురుకున్నాయి.

నీరసంగా బుడ్డిదీపం వెలిగించి గూట్లో వుంచింది.

బొచ్చులో మిగిలిన అన్నం కలియబెట్టి దించి, కూర ముక్కలు ఎక్కించింది.

తరువాత ముఖం దోసెడు నీళ్ళతో కడుక్కుని, పట్నం నుండి మావ తెచ్చిన పౌడరు ముఖానికి అద్దుకుంది. అద్దం పెంకులో చూసుకుంటే తన ముఖం తనకే అందంగా కన్పించింది.

చీరమార్చి, తెల్లగా ఉతికిన చీర కట్టుకుని పంచలోనికి వచ్చింది రంగి!

రోడ్డు మీద వెల్తురు పడడంతో అటువైపుకు చూసింది.

గ్రామం వైపు నుంచి ఏదో కారు వస్తోంది!

కాంతితోబాటు శబ్దం కూడా క్రమేణా హెచ్చయింది.

పెద్దగా రొదచేస్తూ, బురదను చిల్చుకుంటూ వచ్చిన కారు గుడిసె ముందుకు రాగానే కీచుమని శబ్దంచేస్తూ ఆగిపోయింది.

రంగి చీర కుచ్చెళ్ళు సర్దుకుని కారు వైపుకు చూసింది.

కారు తలుపు తెరుచుకుంది!

అందులోంచి దిగిన ఒక యువకుడు పరుగు పరుగున గుడిసె చూరు క్రిందకు వచ్చేడు.

పై మీద వున్న తువ్వాలుతో తల ఒత్తుకుంటూ అడిగేడు.

"బర్కిలీ సిగరెట్లు ఉన్నాయా?"

ఉన్నాయన్నట్లు తల వూపింది రంగి.

గూట్లోంచి పెట్టె తీసి అందించింది.

సిగరెట్టు పెట్టె అందుకుంటూ ఆ యువకుడు రంగి వైపు చూసేడు. బుడ్డిదీపం రెపరెపలు రంగి ముఖం మీదపడి వింతగా ప్రతిఫలిస్తున్నాయి.

కాటుక తీర్చిన ఆమె కనురెప్పలు అతనిలోని కోర్కెలను వెలికి తెచ్చేయి.

కొంతసేపు అతడు ఆమెవంక వెర్రిగా చూస్తూండిపోయాడు. తరువాత "ఈ వూరి చివర ఒంటరిగా ఎలా వుంటున్నావు?" అన్నాడు మాటలు కలిపే ధోరణిలో.

"నేనూ మా మావ కలిసి వుంటున్నాం! ఆడు నిన్న పొద్దుటేళ బండి తోలుకుని పట్నం వెళ్ళేడు. ఇంత వరకూ రాలేదు. దారిలో మావ

బండి ఎదురయితే తొందరగా రమ్మని చెప్పండి బాబూ!" అంది రంగి అమాయకంగా.

"తప్పకుండా చెప్తాను. నేను ఆ దారినే వెళ్తాను కదా!" అంటూ సిగరెట్టు ముట్టించి ఉత్సాహంగా ఒక పీల్పు పీల్చేడు. తర్వాత జేబు లోంచి ఒక బరువయిన పర్సు లాగి అందులోంచి పది రూపాయల నోటు తీసి రంగికి అందించేడు.

"అమ్మో! పెద్ద కాగితమే!.... చిల్లరలేదు!" అంది రంగి.

"ఫరవాలేదు! ఉంచుకో!" అంటూ చిరునవ్వు నవ్వి ఓరకంట ఆమెవైపు చూశాడు.

రంగికి ఏమీ అర్థం కాలేదు.

"మీ సొమ్ము నాకు ఒత్తినే అక్కరలేదు! సిగరెట్ల ఖరీదు ఇవ్వండి చాలు!" అంటూ నోటు అతడికి తిరిగి అందించబోయింది.

"నా దగ్గర చిల్లరలేదు.... నేను తరచు ఈ వూరు వస్తుంటానులే.... ఈసారి వచ్చినపుడు ఇద్దువుగాని...."

రంగి కొంతసేపు అనుమానంగా చూసి, తర్వాత నోటును కొంగుకు కట్టి భద్రపరిచింది.

దరిద్రుని ఆశలా బయట వాన హెచ్చవుతోంది!

అప్పుడప్పుడు మెరుపుల వెలుగులో ప్రపంచం క్షణంసేపు మెరిసి అంతలోనే నల్లబడిపోతోంది.

ఆ యువకుడు ఒక సిగరెట్టు మసి చేసేడు.

నిప్పు ఆర్పకుండా దానితో మరొకటి వెలిగించేడు.

"ఇంతకీ.... నీ పేరేమిటి?" అని అడిగేడు.

"రంగి.... అసలు పేరు కనకమ్మ.... కానీ మా మావ నన్ను ముద్దుగా రంగీ అని పిలుచుకుంటాడు...." ఆ మాటలు చెప్తూ వుంటే ఆమె బుగ్గలు సిగ్గుతో ముడుచుకున్నాయి.

"రంగి.... భలే మంచి పేరు.... నువ్వు ఎంతో అందంగా అప్పరసలా వున్నావు రంగీ!"

పరాయి మొగాడు తన అందాన్ని పొగుడుతూ వుంటే సిగ్గుతో ఆమె తల ఎత్తుకోలేకపోయింది.

కాలి బొటన వేలితో నేలమీద రాస్తూ నిలబడిపోయింది

"రంగీ.... రోడ్డు చాలా బురదగా వుంది.... కారు దిగబడితే కష్టం.... కాస్త వర్షం తగ్గేక వెళ్తాను.... నా జేబులో చాలాడబ్బుంది... ఇక్కడ భయం లేదు కదః...." అంటూ అడిగేడు.

రంగి నవ్వుతూ అంది "ఈ వానలో ఇక్కడి కెవరొస్తారుబాబూ! అయినా, దొంగ ఎదవలకి మా మావపేరు చెప్తేనే హడలు.... చూరు నుండి నీళ్ళు కారిపోతున్నాయి.... ఇలా లోపలికి వచ్చి మంచంమీద కూర్చోండి...." అంటూ లోపలకు దారితీసింది.

ఆ యువకుడు హుషారుగా ఆమెను అనుసరించేడు.

లోనికి వెళ్తూనే తలుపు గడియపెట్టి, వెనుకగా వెళ్ళి రంగి రెండు భుజాలు గట్టిగా పట్టుకుని, ఆమె ముఖాన్ని తన వైపుకు తిప్పుకున్నాడు.

రంగి, పులినోట బడ్డ లేడిలా అతడివంక చూసింది.

ఆమె కళ్ళు భయంతో రెపరెపలాడేయి.

అతడు ఆమెను ఇంకా గట్టిగా పొదివి పట్టుకుని మంచంవైపు నడిపించబోయాడు.

"ఛీః ముదనష్టపోడా!" అంటూ ఆమె అతడిని ఒక్క తోపు తోసింది.

వెనక్కు తూలిపడబోయి నిలదొక్కుకున్నాడు.

దెబ్బతిన్న పులిలా మళ్ళీ ఆమెవంక ఒక్క ఉదుటున ఉరికేడు! బయట ఎక్కడో భయంకర శబ్దంతో పిడుగు పడింది. రంగి ప్రార్ధన, ఆక్రందన వర్షహోరులో కలిసిపోయాయి. కాలగమనం పది నిమిషాలసేపు స్థంభించినట్లయింది.

స్త్రీపై పురుషుని ఆధిక్యత, పైశాచికత్వం మరొకసారి బుజువయింది!!

తలుపులు తెరుచుకుని బయటకు వస్తూ వెనుదిరిగి చూసేడతడు. మంచంమీద వెల్లకిలా పడివుంది రంగి.

బయటకు వచ్చి తలుపులు విసురుగా లాగేడు.

భళ్ళుమనే శబ్దంతో మూసుకున్నాయి అవి.

చూరు క్రిందనుండి తూలిపోతున్నట్లుగా నడుస్తూ కారు దగ్గరకు చేరుకున్నాడు.

రెండు నిమిషాల్లో కారు దెయ్యంలా శబ్దంచేస్తూ వర్షపు నీటిని చీల్చుకుంటూ ముందుకు కదిలిపోయింది!!

* * * *

ఆ రాత్రి—

జగత్తు ప్రకృతిమీద పగబట్టి దానితో ఘోర సంగ్రామం జరుపుతున్నట్లుంది

ప్రకృతి జగత్తుమీద కసి తీర్చుకుంటున్నట్లు విలయ తాండవం చేస్తోంది.

ఉరుములు మహా ప్రళయ సమయ గర్జనల్లా వున్నాయి.

చీకటి జడ విప్పుకున్న భూతంలా వుంది.

అలాటి సమయంలో—

సత్తిగాడు పట్నం వదిలి ఇంటిదారి పట్టేడు.

బీడీ తీసి అంటించి, ఎద్దును హుషారు చేశాడు.

ట్రంకురోడ్డు వదిలి, గ్రామంవైపు మలుపు తిరిగి మట్టి దారి పట్టింది బండి.

చక్రాలు బురదలో కూరుకుని గుంటల్లో పడి లేస్తూ, ఎగుడు దిగుడుగా కదిలిపోతున్నాయి.

వర్షానికీ, చలికీ సత్తిగాడి శరీరం వణికిపోతోంది. ఒంటికి చుట్టుకున్న దుప్పటి సవరించి, మళ్ళీ గట్టిగా బిగించుకున్నాడు.

నిన్నటి ఉదయం పల్లెనుండి పట్నం చేరుకున్నాడు. అక్కడ వరుసగా నాలుగయిదు బాడుగలు తగిలేయి. పదిహేను రూపాయలు సంపాదించేడు ఈ రెండురోజులూ పట్నంలో వుండిపోయినా మనసు మాత్రం రంగినే తలుస్తోంది. ఈ చలిలో— చీకటిలో— చలికి గుడిసెలో రంగి ఎలా వుందో?!

తాను ఒక్క గంట ఆలస్యంగా వెళ్తే రంగి బెంగ పెట్టుకుని తల్లడిల్లిపోతుంది.

తనంటే దానికి ప్రాణం!

ఆలోచనలలో మునిగి తేలుతున్న సత్తిగాడికి దగ్గరలోనే రోడ్డు వారగా ఏదో వెలుతురు కనిపించింది

ఆ వెలుతురు దగ్గర పడుతున్న కొద్దీ అటువైపే పరికించి చూసేడు.

ఏదో కారు ఆగివున్నట్లు అతడికి కన్పించింది.

అది కదలకుండా ప్రక్కకు ఒరిగిపోయి వుండటంవల్ల వాడికి ఏదో అనుమానం వచ్చింది

బండి ఆపి, వర్షాన్నీ ఈదురుగాలినీ లెక్కచేయకుండా కిందకి దిగేడు.

బండి దిగిన మరుక్షణంలో వర్షం వాడిని తడిపి ముద్దచేసింది. బీడీపారేసి దుప్పటి ముసుగు తలమీదకు లాగుకుని గబగబ నడిచి కారు దగ్గరకు వెళ్ళేడు.

కారు దగ్గరకు వెళ్ళేక వాడి కాళ్ళు కదల్లేదు.

ఎదుటి దృశ్యం చూసి భయంతో అలాగే వుండిపోయాడు.

పల్లెటూరి వైపునుండి వస్తున్న కారు రోడ్డుదిగి పల్లంలోకి జారిపోయి, మర్రిచెట్టు మానుకు గుద్దేసి ఆగిపోయిందని తెలియటానికి ఎంతోసేపు పట్టలేదు.

వణుకుతున్న కాళ్ళతో లోనికి తొంగి చూసేడు.

కారు ముందరి లైట్లు ఆరిపోయినా, లోపలి దీపం మాత్రం వెలుగుతోంది.

ముందరి సీటులో ఒక మనిషి పడివున్నాడు.

అతడి ముఖం స్టీరింగ్ చక్రంమీదకు వాలివుంది.

అతడి చేతులు రెండూ ఆ చక్రానికి ఇటూ అటూ వేలాడుతున్నాయి.

అతడి కనురెప్పలు మూతపడి వున్నాయి.

నున్నని మెడమీద, అంతకంటే నున్నగా వున్న బుగ్గలమీద గోళ్ళతో ఎవరో రక్కినట్లు గాట్లు వున్నాయి.

అతడి జుత్తు చిందర వందరగా వుంది

ఎదుటి అద్దం పగిలిపోయి పడిన గాజుముక్కలు సీటునిండా చిందర వందరగా వున్నాయి.

అతడు వేసుకున్న చొక్కా అతి ఖరీదయినదే అయినా, దాన్ని ఎవరో బలవంతంగా చింపినట్లు స్పష్టంగా తెలుస్తోంది.

స్టీరింగ్ వీల్ మీద నుండి వేలాడుతున్న చేతి వేళ్ళకు జిగ జిగ లాడుతూ మెరిసిపోయే మూడు వుంగరాలు ఉన్నాయి.

సత్తిగాడు కొంత సేపు తటపటాయించినా చివరకు ధైర్యం చేసి అతడి ముక్కు దగ్గర వేలు పెట్టి చూసేడు. ఊపిరి ఆడుతోంది!

వెంటనే వైద్యం చేయిస్తే అతడు బ్రతికి బయట పడొచ్చు! కానీ, యింత రాత్రి వేళ—

ఈ వర్షంలో, అతడిని ఎక్కడకు తీసుకు వెళ్ళటం!

దగ్గరలో ఎక్కడా గుడిసెయినా లేవు!

కొంతసేపు ఆలోచించి చివరకు తన మానాన తాను బండెక్కి ఇంటికి వెళ్ళి పోదామనుకున్నాడు.

కానీ, చావు బతుకుల మధ్యనున్న మనిషిని వదిలి ఎలా పోవటం?

తాను వదిలి పోతే, తెల్లారే సరికి ఆ మనిషి చచ్చిపోవచ్చు.

ఆ మనిషి చచ్చిపోతే, ఆ పాపం ఎవరిది?

తనది!!

అవును, తనదే!!

తన సహాయం కోసమే ఆత్రంగా అతడి ప్రాణం ఎదురు చూస్తున్నట్లనిపించింది సత్తిగాడికి.

మరో మనిషి చావు బతుకులతో పోరాటం సాగిస్తూ వుంటే ఎలా వదిలి వెళ్ళటం?

అతడు బాగా డబ్బున్న మారాజుకి మల్లే కనిపిస్తున్నాడు.

సత్తిగాడికి డబ్బున్న వాళ్ళంటే అసూయ, ద్వేషం లేవు! వాళ్ళంటే గౌరవం, భయం వున్నాయి

'వాళ్ళు లేకపోతే బీదవాళ్ళు ఎలా బ్రతుకుతారు? వాళ్ళు చల్లగా చూడబట్టే తనలాటి వాళ్ళు బ్రతుకు కడతేరుతోంది.'

ధనికుల గురించి స్థూలంగా సత్తిగాడి అభిప్రాయం అది.

ఆ సమయంలో—

ఆపదలో వున్న ఆ డబ్బున్న మారాజుని అలా గాలికీ, వానకీ వదిలి వెళ్ళటానికి సత్తిగాడి మనసు అంగీకరించలేదు. కానీ అతడిని పల్లెకు తీసుకుపోతే అక్కడ మందిచ్చే వాళ్ళు ఎవరూ లేరు.

పట్నం తీసుకుపోయి పెద్ద డాక్టరు ఆసుపత్రిలోనే పడెయ్యాలి!

డబ్బున్న మారాజు లందరూ ఆ యాసుపత్రికే వెళ్తారు. మునసబు గారి అల్లుడికి మాయదారి రోగం ముంచు కొచ్చినప్పుడు తన బండి లోనే ఆ యాసుపత్రికి తీసుకెళ్ళేడు.

ప్రెసిడెంటు రాజుగారి భార్య పురుడు కూడా అక్కడే పోసుకుంది.

ఆ డాక్టరు బాబు తనకు తెలుసు.

అక్కడికి తీసుకు వెళ్తే ఈ మనిషి బతుకుతాడు.

అవును! తప్పక బతుకుతాడు.

ఒక మనిషి తన వలన బతికి బయట పడుతున్నాడన్న ఊహ రాగానే సత్తిగాడి మనసు తృప్తితో, గర్వంతో నిండిపోయింది! వెంటనే దుప్పటి తీసి భుజంమీద వేసుకుని, ఊడిపోయిన తలపును తొలగించి, రెండు చేతులతోనూ ఆ మనిషిని ఎత్తుకుని, బండిలోనికి తీసుకువచ్చి, అందులో గడ్డిమీద పడుకోబెట్టాడు సత్తిగాడు.

బండిని వెనుకకు మళ్ళించి పట్నంవైపు దారి తీశాడు.

ఆ కాళ రాత్రి సమయంలో—

ఆ భీభత్స వాతావరణంలో—

మంచితనం మీద, మానవత్వం మీద, ధర్మం మీద, న్యాయం మీద, సత్యం మీద—వీటన్నిటి మీదా నమ్మకంగల సత్తిగాడు ఎద్దుని అదిలించి పట్నం వైపు బండిని నడిపించేడు!!

* * * *

సన్నగా తెల్లవారుతోంది.

రెండు రోజుల నుండీ వదల కుండా పీడిస్తున్న ముసురు కాస్త తగ్గు ముఖం పట్టింది.

వర్షం తగ్గినా, గాలి మాత్రం యింకా రొద చేస్తూనే వుంది. మబ్బులు విడిపోయి నీలాకాశం బయటకు తొంగి చూస్తోంది. తడిసి ముద్దయిన ప్రకృతి సుందరి తల ఆరబెట్టు కుంటున్నట్లుంది.

సత్తిగాడి బండి పల్లె దాపులకు చేరుకుంది.

రాత్రి కంటి మీద కునుకు లేకపోవటం వల్ల వాడి ఒడలంతా మత్తుగా జోగుతోంది.

రాత్రి ఆ మనిషిని తన బండిలో తీసుకువెళ్ళి ఆసుపత్రిలో చేర్పేడు.

డాక్టరు బాబు వెంటనే మందులు యిచ్చేడు! ఆపరేషను చేశాడు! అతడు బతుకుతాడని చెప్పేడు.

తాను చెప్పినదంతా విని ఆ బాబు తనను ఎంతో మెచ్చు కున్నాడు.

"సత్తీ! నువ్వు అతడిని సమయానికి రక్షించేవు! లేకపోతే అతడి ప్రాణం పోయేది! చావటానికి సిద్ధమయిన అతడిని నువ్వు తీసుకు రాబట్టే నేను బతికించ గలిగేను! యింకో గంట ఆలస్యమయితే అతడు చచ్చిపోయి వుండేవాడు! దేవుడు నీకు మేలు చేస్తాడురా!" అన్నాడు డాక్టరు బాబు. నిజంగా డాక్టరు బాబు దేవుడే!

"రేపు సాయంకాలం మళ్ళీ వచ్చి కనిపించు! వాళ్ళ మనుషులు ఈలోగా వస్తారుకదా, వాళ్ళచేత నీకు డబ్బు ఇప్పిస్తాను!" అన్నాడా బాబు.

"అదేమిటి బాబూ! నేను డబ్బు కోసం పాకులాడే మడిసిని కాను. అతడూ సాటి మడిసే కనక, ఆపదలో వున్నపుడు సాయపడాలి గనక, నా బండిలో తీసుకొచ్చేను. ఇంక నేను ఎల్తాను బాబూ! ఆ మారాజుని మీరే కాపాడండి!" అంటూ బండి ఎక్కేడు సత్తిగాడు.

విడిపోయిన మబ్బుల మధ్య నుండి వెలుతురు లోకాన్ని ఆక్రమించుకుంటోంది.

దగ్గరలోనే గుడిసె స్పష్టంగా కన్పిస్తోంది.

పై మీద వున్న దుప్పటిని బండి మీద గడ్డిలో ఆరబెట్టాడు.

గుడిసె దగ్గరకు రాగానే బండి ఆపి, ఎద్దును విప్పి వేపమానుకు కట్టి దాని వీపు ప్రేమగా నిమిరి గుడిసె దగ్గరకు వచ్చేడు.

గుడెసె ముందు భాగమంతా తాటాకులు లేచిపోయి చూశటానికి అసహ్యంగా వుంది.

తలుపు తోసుకుని, లోనికి అడుగు పెట్టిన సత్తిగాడు—— ఎదుటి దృశ్యం చూసి స్థంభీభూతుడయి పోయాడు.

"రంగీ!"

దిక్కులు పిక్కటిల్లేలా కేక పెట్టాడు.

తర్వాత బావురు మన్నాడు!!

చూరునుండి ఉరిపోసుకుని వేలాడుతున్న రంగి శవం తప్ప అతనికి ఇంకేం కనబడలేదు!!

'భగవంతుడా! నేనే పాపం చేశానని నాకీ శిక్ష వేశావ్? రంగి లేకుండా నేను ఎలా బ్రతికేది?

నేనే పాపం చేశానని అది ఉరోసుకుంది!

మాల గూడెంలో మసిబొగ్గులా పడి వుంటే, దాన్ని చేరదీసి, పెళ్ళి చేసుకున్నాను.

దాని కోసం అమ్మనీ బాబునీ ఒగ్గేశాను.

అయిన వాళ్ళందరినీ ఒగ్గేశాను.

మనసిచ్చిన ఆడదాని కోసం మతాన్నీ, కులాన్నీ లెక్కసెయ్యలేదు.

అదే నేను చేసిన పాపమా?

దారిలో ఓ మనిషి చావు బతుకుల్లో వుంటే—వానసీ వరదనీ లెక్క చెయ్యకుండా ఆ బాబుని ఆసుపత్రికి తీసికెళ్ళేనే.

ఆ మారాజు పేణం కాపాడేనని డాక్టరు బాబు నన్నెంతో పొగిడేడు!!

నేను మళ్ళీ పట్నం వెళ్ళకుండా, రాత్రికి రాత్రే యింటికి తిరిగి వచ్చి వుంటే నా రంగి నాకు దక్కేదేమో!!

చావు బతుకుల మధ్యనుండే మనిషిని రక్షించటమే నా పాపమా?

ఆ పాపానికి నువ్వు నా రంగి పేణం బలి తీసుకున్నావా?

రంగి ఎందుకు సచ్చిపోయిందీ?

ఏ కారణమూ లేకుండా ఎందుకు సచ్చిపోయింది?

నువ్వు దేవుడివి!

కాబట్టి నువ్వే నిజం చెప్పాల.

దేవుడూ, నువ్వే చెప్పాల.'

గుడిసెలో ఒక వారగా వున్న దేవుని పటంముందు నిలబడి చేసిన అతని ప్రార్థన పెదవుల క్రిందే వుండిపోయింది.

జుత్తు పీక్కుంటూ—

గుండెలు బాదుకుంటూ-

ఏడ్చి ఏడ్చి, ఇక ఏడవటానికి కూడా శక్తిలేక సొమ్మసిల్లి పడిపోయాడు సత్తిగాడు!

*   *   *

"సత్తీ! నువ్వు రాత్రి కారులో పడివున్న మారాజుని పట్నం తీసుకెళ్ళి రక్షించేవు!

తోటి మానవుడు చావుబతుకుల మధ్యనుంటే చూస్తూ, కళ్ళు మూసుకుని ఎవరి దారిన వారు వెళ్ళిపోవడం న్యాయం కాదు.

నీలో మానవత్వం వుంది!

మంచితనం వుంది!

నువ్వు ప్రాణంకంటే ఎక్కువగా చూసుకునే ఇల్లాలు చచ్చిపోవటానికి కారణం ఆ మారాజే అని నీకు తెలీదు!

అవును! నీకు తెలీదు!

దేవుడు నీకా నిజాన్ని చెప్పడు!

దేవుడే కాదు, ఎవ్వరూ నీకా నిజాన్ని చెప్పరు!

ఆ నిజం నీకు తెలిస్తే నువ్వు రాక్షసుడవయిపోతావు!

నీలోని మానవత్వం మంటగలిసిపోతుంది!

నీలోని మంచితనం రూపు మాసిపోతుంది!

నీలోని ధర్మం, న్యాయం, సత్యం అన్నీ రెక్కలు విప్పుకుని ఎగిరిపోతాయి!

ఇది లోకం సత్తీ, లోకం!

ఇది మాయాలోకం!

ఇక్కడ అధర్మానికీ, అన్యాయానికీ, అసత్యానికీ, పాపానికీ, రాక్షసత్వానికీ మాత్రమే చోటు వుంది!

నువ్వీ లోకంలో బతకటానికి పనికిరావు సత్తీ! పనికిరావు!!

*